ప్రజాశక్తి

శుక్రవారం 17 అక్టోబర్ 2025 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా

నిధులు గోల్‌మాల్

- ఇంటి పన్నులు, అద్దెలు జమ చేయని వైనం
- నేడు కంచికచర్ల పంచాయతీలో విచారణ?



ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల గ్రామ పంచాయతీలో నిధులు గోల్‌మాల్ అయిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివిధ పన్నుల రూపంలో వసూళ్ల చేసిన నిధులు గ్రామ పంచాయతీ అకౌంటులో జమ చేయకుండా వాడుకున్న సిబ్బంది బదిలీ అయిన ఏదాది తర్వాత విషయం వెలుగులోకి రావడంతో పంచాయితీ అధికారుల పనితీరు తేటతెల్లమవుతుందని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. ప్రస్తుత పాలకవర్గం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పంచాయతీలో నిధులు గోల్‌మాల్ జరిగినట్లు పలువురు అంటున్నారు. సుమారు రూ.30 లక్షలు అధికారికంగానే గ్రామ పంచాయతీ నిధులు గోల్‌మాల్ అయినట్లు అధికారులే చెబుతుండగా, లెక్కకు రాకుండా ఎన్ని లక్షలు పక్కదారి పట్టాయోనని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలోనే మేజరు పంచాయతీ అయిన కంచికచర్లలో 30 వేలకు పైగా జనాభా ఉన్నారు. ప్రతిఏటా గ్రామ పంచాయతీ విస్తీర్ణం పెరుగుతూనే ఉంది. కంచికచర్ల గ్రామ పంచాయతీకి ప్రతి ఏటా ఇంటి పన్నుల రూపేణా రూ.1.30 కోట్లు, షాపులు, ఇతర అద్దెల రూపంలో మరో రూ.25 లక్షలు వెరసి మొత్తం ఏటా సుమారుగా రూ.1.60 కోట్లు పంచాయతీకి ఆదాయం వస్తుంది. అయితే ఇందులో ఇంటి పన్ను రూపంలో, షాపులు అద్దెల రూపంలో వసూలు చేసిన దానిలో సుమారు 27.5 లక్షల రూపాయలు పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా గతంలో కంచికచర్ల గ్రామ పంచాయతీలో పని చేసిన సిబ్బంది సొంతానికి వాడుకున్నట్లు తెలిసింది. అయితే గతేడాది పని చేసిన నిబ్బంది ఈ నిధులు గోల్‌మాల్ చేసి లెక్కలు చెప్పకుండా బదిలీపై వెళ్లారు. ఏడాది డాలంగా గ్రామ పంచాయతీకి జమ కావాల్సిన నిధులు జమ చేయకపోయినా ఇప్పటివరకు సంబంధిత శాఖ అధికారులు ఈ విషయం బయటకు రాకుండా జాగ్రత్తపడ్డారంటే దీనిలో ఎవరి పాత్ర ఎంత ఉందోనని ప్రజలు అంటున్నారు. గత కొద్దిరోజుల (మిగతా 2లో)

ఎన్‌టిఆర్ జిల్లాలో సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లాలోని ప్రజా సమస్యలను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ డిమాండ్ చేశారు. సిపిఎం ఎన్టీఆర్ జిల్లా కమిటీ సమావేశం విజయవాడలో జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హాజరై పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయాలు, ప్రస్తుత రాజకీయాల పరిణామాలు వివరించారు. అనంతరం డి.వి.కృష్ణ ఎన్‌టిఆర్ జిల్లాలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కృష్ణానది ప్రవహిస్తున్నా దాని సమీపంలో ఉన్న జగ్గయ్యపేట, నందిగామ, ఇబ్రహీంపట్నం, కొండపల్లి, కొటికలపూడి, నున్న ప్రాంతాల్లో ప్రజలు తాగటానికి మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు ఆందోళన చేసినప్పుడు తాత్కాలికంగా రెండు, మూడు రోజులు చర్యలు చేపడుతున్నారు తప్ప శాశ్వత పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదన్నారు. బుడమేరుపై పాలకులు చేసిన వాగ్దానాలను అమలు చేయాలని, ముంపు ప్రమాదాన్ని నివారించాలని, గతంలో వరదతో నష్టపోయిన పేదలకు పరిహారం చెల్లించాలని కోరారు. జిల్లా అంతటా బెల్ట్ షాపులు విచ్చలవిడిగా ఉన్నాయని, కూటమి నాయకుల కనుసన్నల్లోనే షాపులు నడుస్తున్నాయని, దీనికి తోడు ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం ఉత్పత్తి కేంద్రంగా ఉందని, వీటిని అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విజయవాడ నగరంలో కొండ ప్రాంతాల సమస్యలు పరిష్కరించి, రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వాలని కోరారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏళ్ల తరబడి పేదప్రజలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని, అటవీ భూములు 60/70 ఏళ్లగా సాగు చేసుకుంటున్న గిరిజనులు, పేదలకు పట్టాలిచ్చి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తిచేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. 22(ఎ) పేరుతో ప్రజల భూములను ప్రభుత్వం లాక్కోవడం తగదన్నారు. ఇబ్రహీంపట్నంలోని ధర్మల్ పవర్ స్టేషన్లో తాగునీటిలో బూడిద కలవడంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని, దీని వల్ల రోజుల తరబడి నీటి సరఫరా నిలిచిపోతుందని, వెంటనే పరిష్కరించాలని కోరారు. గంపలగూడెం వద్ద 2018లో వరదలకు కూలిపోయిన వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని, వత్సవాయి మండలం లింగాల వద్ద వంతెన పునర్నిర్మాణం చేయాలని, ఎ.కొండూరు-అట్లప్రగడ మధ్యలో ఉన్న వంతెన నిర్మాణం చేపట్టాలని, అంతర్గత రోడ్లు బాగు చేయాలని, అధిక వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, జిల్లాలో కిడ్నీ హాస్పిటల్ నిర్మించాలని, తిరువూరు నియోజవర్గ ప్రజలకు ఫ్లోరైడ్ రహిత కృష్ణానది నీటిని అందించాలని కోరారు.



రైల్వే స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా నాయకులు

అత్యాచార నిందితుడిని శిక్షించాలి

ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు కె.శ్రీదేవి

ప్రజాశక్తి-విజయవాడ


గుంటూరు-పెదకూరపాడు మధ్యలో రైల్లో ప్రయాణిస్తున్న మహిళపై చోటుచేసుకున్న అత్యాచార ఘటనలోని నిందితుడిని అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీదేవి డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా రైళ్లలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. గుంటూరు-పెదకూరపాడు మధ్యలో రైలులో మహిళలపై జరిగిన అత్యాచారాన్ని నిరశిస్తూ విజయవాడ రైల్వే స్టేషన్ గడియార స్తంభం సెంటర్‌లో విజయవాడ ఐద్వా ఆధ్వర్యంలో గురువారం ధర్నా, నిరసన కార్యక్రమం జరిగింది. మహిళలకు రైళ్లలో భద్రత కల్పించాలని, రైలులో మహిళలపై అత్యాచారం సిగ్గు...సిగ్గు, మహిళలకు భద్రత కల్పించడంలో విఫలమయిన ప్రభుత్వాలంటూ ఐద్వా నాయకులు నినాదాలు చేశారు. ఈసందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ...మహిళలపై నేరాల సంఖ్య రోజు రోజుకు రాష్ట్రంలో పెరుగుతున్నాయని, ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు భద్రత లేనటువంటి వాతావరణం రాష్ట్రంలో నెలకొన్నదన్నారు. రైలులో ఎక్కిన తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఒక మహిళపై గుంటూరు-పెదకూరపాడు మధ్యలో రైలు బోగీలోనే అత్యాచారం చేయడం, బెదిరించడం ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడాన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రైలు బోగీలోనే మహిళలపై ఇటువంటి దారుణమైన సంఘటనలు చోటు చేసుకుంటున్నా రైల్వే అధికారులు మహిళలకు భద్రతా చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలమవుతున్నారని విమర్శించారు. బోగీలో కానీ, ఎక్కడా సిసి కెమెరాలు లేవన్నారు.పోలీసుల నిఘా బోగీలో ఉండటం లేదన్నారు.రైల్వే పోలీసుల నిఘా పటిష్టంగా ఉన్నట్లయితే ఈ రోజు మహిళపై అత్యాచారం జరిగి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇప్పటికయినా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి రైళ్లలో ప్రయాణించే మహిళలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇదే సందర్భంలో కేంద్ర ప్రభుత్వం, కేంద్ర రైల్వేశాఖ, రైల్వే యాజమాన్యం వెంటనే ఇటువంటి ఘటనల పట్ల స్పందించాలని, దోషిని తక్షణమే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు రైళ్లల్లో చోరీలు జరిగి నగదు, ఇతర విలువైన వస్తువులు దొంగిలించే వారని, కానీ ప్రస్తుతం మహిళలపై (మిగతా 2లో)

బోధనలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి 7లో

సాంస్కృతిక, ప్రజా కళలకు వేదిక

నడికట్టు పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాలు, వేమన సాంస్కృతిక వేదిక ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజా కళలు, సాంస్కృతిక, సేవా కార్యక్రమాలకు వేదికగా నడికట్టు పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాల్, వేమన సాంస్కృతిక వేదిక నిలుస్తాయని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ రాణిగారితోటలోని గుంటూరు బాపనయ్య భవన్‌పై నడికట్టు వెంకటసుబ్బమ్మ ఆర్థిక సహకారంతో నూతనంగా నిర్మించిన నడికట్టు పెద్దవెంకటరెడ్డి మెమోరియల్ హాల్ శిలాఫలకాన్ని దాత కుటుంబ సభ్యులతో కలిసి మాజీ ఎంఎల్‌సి ఎంవిఎస్ శర్మ, వేమన సాంస్కృతిక వేదికను మాజీ కార్పొరేటర్ దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి విఎంసి మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ సిహెచ్.బాబూరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు వేమన సాంస్కృతిక వేదిక కన్వీనర్ ఎన్.హరినారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ సాంస్కృతిక, సాహిత్య రంగాలు ఒక రకమైన ఆలోచనలను ప్రచారం చేసే వాటిగా, పనిముట్లుగా దిగజారిపోయిన నేటి కాలంలో ప్రజల ఆకాంక్షలను, కళలను, వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ప్రజలే సాధానాలు ఏర్పాటు చేసుకునే పరిస్థితులు వచ్చాయన్నారు. విఎంసి మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ చిగురుపాటి బాబూరావు మాట్లాడుతూ ప్రజా సాంస్కృతిక వేదికగా నడికట్టు పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాలు నిలుస్తుందని, ఈ హాలు నిర్మాణానికి భూరి విరాళం ఇచ్చిన దాత వెంకటసుబ్బమ్మను అభినందిస్తున్నానని అన్నారు. నేడున్న విష సంస్కృతి, పాలకుల విధానాల వల్ల 8 నుంచి 10వ తరగతి హైస్కూల్ స్థాయిలో యువతీ యువకులు, విద్యార్థులు సైతం గంజాయి, ఇతర మత్తు పద్దార్థాలకు లోనై వారి సామర్థ్యం నిర్వీర్యం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో విద్యార్థులు, యువతీ యువకులను, ప్రజలను సరైన బాటలో నడపడానికి, (మిగతా 2లో)





హాలు, వేదికను ప్రారంభిస్తున్న మాజీ ఎంఎల్‌సి శర్మ, మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ బాబూరావు, మాజీ కార్పొరేటర్ కాశీనాథ్, దాత వెంకటసుబ్బమ్మ

వాంబేకాలనీ అండర్ బ్రిడ్జి వెడల్పు, ఎత్తు పెంచాలి

ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు

ప్రజాశక్తి–విజయవాడ: అధికార టిడిపి నేతలు, ప్రజా ప్రతినిధులు పాలాభిషేకాలు, ప్రచార ఆర్భాటానికి పరిమితం కాకుండా డిజైన్లు మార్చి దీర్ఘకాలంగా ప్రజలకు ప్రయోజనం కల్పించే రీతిలో అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు పేర్కొన్నారు. విజయవాడ వాంబే కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని, వెడల్పు మూడు మీటర్ల నుండి పది మీటర్లకు పెంచాలని, బస్సుల రాకపోకలకు వీలుగా ఎత్తు పెంచాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం వాంబే కాలనీ రైల్వే లైన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ గత రెండు దశాబ్దాల నుండి స్థానిక ప్రజలు, సిపిఎం ఆందోళన ఫలితంగా వాంబేకాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. అయితే కనీసం పది మీటర్లు (33అడుగులు) వెడల్పు ఉండే విధంగా డిజైన్ రూపొందించి, బస్సు రాకపోకలకు వీలుగా ఎత్తు పెంచాలని, అందుకు అవసరమైన నిధులను కేటాయించాలని కోరారు. కొత్త బస్టాండు, కళాక్షేత్రం వద్ద ఉన్న బ్రిడ్జిల తరహాలో వాంబే కాలనీ అండర్ బ్రిడ్జి ఉండాలన్నారు. దీని వల్ల కనకదుర్గ వారధి నుండి నూజివీడు రోడ్డు వరకు రాకపోకలకు అనువుగా ఉంటుందన్నారు. విజయవాడ నగర ప్రజలే కాకుండా నూజివీడు ప్రాంతం వరకు ఉన్న గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందన్నారు. ప్రయాణ దూరం, సమయం తగ్గుతుందని తెలిపారు. లక్షల మంది ప్రజలకు దీర్ఘకాలం ప్రయోజనం



కలుగుతుందన్నారు. ఒకసారి తక్కువ వెడల్పు, ఎత్తులో సబ్ వే నిర్మించిన తర్వాత మళ్లీ మార్పు సాధ్యపడదన్నారు. అందువల్ల అధికార పార్టీ నేతలు, ప్రతినిధులు ముందుగానే తేరుకొని ప్రజలకు ఉపయోగపడేలా బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయాలన్నారు. తక్షణం నిధులు మంజూరు చేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, కార్యదర్శివర్గ సభ్యులు కె.దుర్గారావు, నాయకులు టి ప్రవీణ్, పీరూసాహెబ్, సిహెచ్ శ్రీనివాస్, రత్నకుమారి, బి రాంబాబు, అప్పన్న, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నుల సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి–విజయవాడ: ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్‌కు తగ్గట్టుగా ఉందా లేదా అని సర్వే ద్వారా నిర్ధారణ చేసి, పన్ను మార్పుకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డిసిఆర్ జి.సృజన పేర్కొన్నారు. విఎంసి నూతన భవన్‌లోరెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో గురువారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిసిఆర్ సృజన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నగరంలో జరుగుతున్న సర్వే స్థితిగతులను సమీక్షించారు. ఈ సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో గల అన్ని ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా లేదా వాటి పైన ఇల్లు నిర్మించారా, ఒకవేళ ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుకి మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్ కు తగ్గట్టుగా ఉందా లేదా, ఒకవేళ అదనముగా రూములు నిర్మించిన, ఫ్లోర్లు నిర్మించిన, ఆ మార్పుకు తగ్గట్టుగా పన్నును ఈ సర్వే ద్వారా మార్చాలని అన్నారు. అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కచ్చితంగా ఈ సర్వేను పూర్తి చేయాలని అన్నారు. అలాగే ప్రజలు కూడా సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, ఏ యూ బి శర్మ, డి.శ్రీనివాస్, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

నిధులు గోల్‌మాల్

క్రితం నిధుల గోల్‌మాల్‌పై జిల్లా పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీనిపై ఈ నెల 17న జిల్లా పంచాయతీ అధికారి పరివేక్షణలో కంచికచర్ల పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నట్లు తెలిసింది.

నిధుల గోల్‌మాల్ విషయం తెలియదు
కంచికచర్ల పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం

పంచాయతీలో నిధులు గోల్‌మాల్ అయిన విషయం తెలియదు. ఈ ఏదాది మే నెల నుంచి కంచికచర్ల కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నా. నేను బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి గ్రామ పంచాయతీ నిధులు ఎలాంటి గోల్‌మాల్ కాలేదు. రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన ఆర్థిక లావాదేవీలతో నాకు సంబంధం లేదు. అయితే ఇంటిపన్ను, షాపింగ్ అద్దె రూపంలో వచ్చిన నిధులు కొంత గతంలో పని చేసిన సిబ్బంది పంచాయతీ ఖాతాకు జమ చేయకుండా వాడుకున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదు అందిన విషయం తెలిసింది.

సాంస్కృతిక, ప్రజా కళలకు వేదిక

కళలు, సైన్స్, సాంస్కృతిక, కళారూపాలు అభివృద్ధి కావడానికి గుంటూరు బాపనయ్య భవన్‌లో నిర్వహిస్తున్న సుందరయ్య గ్రంథాలయం, వేమన సాంస్కృతిక కళావేదిక, పెద్ద వెంకటరెడ్డి మెమోరియల్ హాలు వేదికలుగా నిలుస్తాయన్నారు. మాజీ కార్పొరేటర్ దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ వ్యాపార దృక్పథంతో అనేక సంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారుతున్న నేటి కాలంలో యువతీయువకులకు, ప్రజలకు ఎన్ని రూపాల్లో ఉపయోగపడాలో అన్ని రకాలుగా ఉపయోగపడే విధంగా కళా వేదికగా పెద్ద వెంకటరెడ్డి మెమోరియాల్ హాలును నిర్వహించడం జరుగుతుందన్నారు. ముందుగా వేదికపై నడికట్టు పెద్ద వెంకటరెడ్డి చిత్రపటానికి కుటుంబ సభ్యులు, నాయకులతో కలిసి శర్మ, బాబూరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పుప్పాల కృష్ణ, సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు, వేమన సాంస్కృతిక వేదిక కో కన్వీనర్ తమ్మిన చంద్రశేఖర్, పూర్ణ చంద్రారెడ్డి, ప్రజాసంఘాల బాధ్యులు వై.కృష్ణ, ఎ.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార నిందితుడిని శిక్షించాలి

దాడులు, అత్యాచారాల వంటి ఘటనలు నమోదు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర రైల్వ శాఖ మహిళలకు భద్రత కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు జి ఆదిలక్ష్మీ, జిల్లా కమిటీ సభ్యులు ఎస్‌కె షకీల తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో విజయవాడ అభివృద్ధి

మేయర్ రాయన భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి–విజయవాడ: అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో పౌర సేవలు భేష్ అని, విజయవాడను ఆధునిక సాంకేతికత తో అభివద్ధి చేస్తాం అని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. ఈ నెల 15, 16 తేదీలలో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నిర్వహించిన నేషనల్ అర్బన్ కాంక్లేవ్ అండ్ మెయరల్ సమ్మిట్ లో విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంక్లేవ్‌నుద్దేశించి మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా గుజరాత్‌లోని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారు నిర్వహించిన నేషనల్ అర్బన్ కాన్క్లేవ్ అండ్ మెయరల్ సమ్మిట్‌లో "షేపింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ సిటీస్" అనే అంశంపై సదస్సు జరిగిందని అన్నారు. ఈ సదస్సుకు దేశ వ్యాప్తంగా 110 కి పైగా ఆయా నగరాల నుండి మేయర్లు, నాయకులు పాల్గొన్నారని న్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ కాంక్లేవ్‌లో పెరుగుతున్న నగరీకరణ, వాటి అవసరాలు తదితర అంశాలు, ఆధునిక సాంకేతికత కూడిన అభివద్ధిపై వివరించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగా సబర్మతి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్, అహ్మదాబాద్ బిఆర్‌టిఎస్, మెట్రో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా నగర పౌరులకు సేవలందించడం వంటివి విషయాలు తెలిశాయన్నారు. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వారి వేస్ట్ ఎనర్జీ ప్లాంట్, నర్సాపూర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను క్షేత్రస్థాయిలో చూపించి అందులో వారు చేసిన అభివద్ధిని వివరించారన్నారు. గ్రేటర్ విజయవాడ దిశగా మారుతున్న విజయవాడకు ఇవి ఎంతో అవసరమని మేయర్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, రివర్ ఫ్రంట్, ఆధునిక సాంకేతికతతో కూడిన పౌర సేవలు విజయవాడను అభివృద్ధి పథంలో నడుపుతాయని అన్నారు.





రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ బోడే ప్రసాదు

సిమెంటు రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి-కంకిపాడు : తాడిగడప మున్సిపాలిటీలో కోపరేటివ్ బ్యాంక్ ఏరియా సిమెంటు రోడ్డు, డ్రైనేజీలను పెనమలూరు ఎంఎల్ఎ బోడే ప్రసాదు గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం కోసం 40 లక్షల 70 వేల రూపాయల నిధులు కేటాయించినట్లు తెలిపారు. గతంలో పోరంకి గ్రామానికి తాను ఉపసర్పంచిగా ఉన్న సమయంలో దాదాపు 70 రోడ్లు నిర్మాణం చేశానని, మరలా ఇప్పుడు ఎమ్మెల్యేగా 40.70 లక్షల రూపాయలతో సిమెంటు రోడ్లు డ్రైనేజీ నిర్మాణం ప్రారంభోత్సవం చేయడం సంతోషంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఈ 15 నెలల కాలంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలకు అందిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు

దీపావళి దుకాణాల ఏర్పాటుకు అనుమతి మంజూరు

ప్రజాశక్తి-మొవ్వ : దీపావళి పండుగ సందర్భంగా మొవ్వ మండలంలో తొమ్మిది బాణాసంచా దుకాణాలకు అనుమతులు అందజేసినట్లు తాసిల్దార్ కే మస్తాన్ తెలిపారు. ఆ దుకాణాలు ఏర్పాట్లకు గురువారం స్థలాలను పరిశీలించి ఎంపిక చేసినట్లు వివరించారు. పెదపూడి లోని పెడసనగల్లు రోడ్డులో గల పెదపూడి కూచిపూడి వర్తక సంఘ కళ్యాణమండపంలో మూడు దుకాణాలు, నిడుమోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో రెండు దుకాణాలు, కోసూరు కోపరేటివ్ సొసైటీలో, కాజ జిల్లా పరిషత్ హై స్కూల్లో ఒక్కొక్క దుకాణం, మొవ్వ కళ్యాణ మండపంలో ఒకటి, కూచిపూడి రోడ్ లో పొలాల దగ్గరలో ఒకటి మంజూరు చేసినట్లు వివరించారు. వీటిని కూచిపూడి ఎస్సై కేఎన్ విశ్వనాథ్, మొవ్వ ఫైర్ ఆఫీసర్ కె వెంకటేశ్వరరావు, పామర్రు ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, ఎలక్ట్రికల్ ఏఈ రమేష్, ఆర్ ఐ ఏ విజయదుర్గలతోపాటు ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

రుణాలు అందజేత

ప్రజాశక్తి-గుడివాడ : హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ప్రజలకు మరింత చేరువ అయేందుకు బంగారంపై తక్కువ వడ్డీతో ఖాతాదారులకు రుణాలు అందిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకోవలని గుడివాడ డివిజనల్ పోలీసు అధికారి దీరజ్ వినీల్ అన్నారు. గురువారం స్థానిక సత్యనారాయణపురంలోని కిన్నెర కాంప్లెక్స్‌లోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ 2లో తక్కువ వడ్డీకి బంగారు అభరణాలపై రుణాలను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న డియస్‌పి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రొడక్ట్ హెడ్ జె.కించిత్, బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ గుడ్లవల్లేటి మెహన్‌కుమార్, సిబ్బంది గొడవర్తి తేజ, ఖాతాదారులు, పాల్గొన్నారు.

సాంకేతికను అందిపుచ్చుకుని ముందుకెళ్లాలి

- ఫ్రెషర్స్ డే వేడుకల్లో కెయు విసి కె. రాంజీ

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూని వర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాలలో కొత్తగా వచ్చిన విద్యార్థులకు ఆహ్వానం పలికే వేదిక ఫ్రెషర్స్ డే గురువారం నూతన ఉత్సాహంతో ఆహ్లాదకర వాతావరణంలో వేడుకలా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే రాంజీ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు వికాసం కూడా తప్పనిసరి అన్నారు. సాంకేతికత అందిపుచ్చుకోవడంలో వయసుతో సంబంధం లేకుండా ముందుండాలనీ, కాలంతో పోటీపడి మనల్ని మనం ఎప్పటికప్పుడు నవీకరించు కోవాలని విద్యార్థులకు సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష మాట్లాడుతూ విద్యార్థులకు కావలసిన అన్ని వసతులను ఎప్పటికప్పుడు కాలానుగుణంగా ఏర్పాటు చేస్తున్నామనీ, వాటిని సద్వినియోగం చేసుకొని జీవితంలో స్థిరపడాలని అభిలాషించారు. విద్యార్థుల కేరింతలతో ఆటపాటలతో గ్రూప్ డాన్స్ ల కోలాహలంతో ఆడిటోరియం అంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు, ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్ విజయ కుమారి, బోధనా, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న విసి రాంజీ, తదితరులు

మొక్కలు పెంచడం అలవాటుగా మార్చుకోవాలి : వడ్డే



ప్రజాశక్తి-ఉయ్యూరు : మొక్కలు మన ప్రాణాధారమని ప్రతి వ్యక్తి తన జీవితంలో కనీసం 14 మొక్కలు నాటి పెంచాలని మాజీ పార్లమెంటు సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి వడ్డే శోభనాద్రి ఈశ్వరరావు అన్నారు. గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గుళ్ళపల్లి కోటేశ్వరరావు పంపిణీ చేసిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ దశ నుంచే మొక్కలను పెంచి సంరక్షించాలని సూచించారు. జమ్ అకాడమీ విష్ణు సేవా సమితి తరపున మొక్కల పెంపకం, మానవతా విలువలు, పర్యావరణం విశిష్టత తెలియజేస్తూ బ్రోచెరు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి వి నాగేశ్వరరావు, ప్రముఖ కార్టునిస్ట్ హరికష్ణ, రిటైర్డ్ డిజిఎం ప్రసాద్ , డాక్టర్ ద్విజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి-పమిడిముక్కల : ముస్లిం మైనార్టీలకు మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఎంతో మేలు చేశారని మైనార్టీ సెల్ అధ్యక్షులు అజీజ్ అన్నారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నియమితులైన అజీజ్ గురువారం మండలంలోని పత్తేలంకలో మాట్లాడారు. పామర్రు మాజీ ఎమ్మెల్యే కైలా అనిల్ కుమార్ తనకు ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానని తెలిపారు. ముస్లింల సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. గ్రామ సర్పంచ్ ఇదైతుల్లా, మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : జంతు సంక్ర ˊమిత వ్యాధుల పట్ల పశు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి అని గన్నవరం పశుసంవర్ధక శాఖ ఉపసం చాలకులు డాక్టర్ చంద్రమోహన్ అన్నారు. గన్నవరం ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల చికిత్సలయ ప్రాంగణంలో జోన్ హాఫ్ కింగ్స్ యూనివర్సిటీ వారు గురువారం నిర్వహించిన సెమినార్ లో డాక్టర్ చంద్రమోహన్, సోహైల్ అహ్మద్ లు పశువైద్య సిబ్బందికి జంతు సంక్రమిత వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కష్ణాజిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ చిన్న నరసింహులు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం గన్నవరం పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుల వారి పరిధిలోని ఏడు మండలాల నుండి సుమారు 60 మంది సిబ్బంది పాల్గొన్నారు..ఈ కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహణ అధికారి సుధీర్ బాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి -నందివాడ : మండలంలోని జనార్ధనపురం గ్రామంలో రీ సర్వేలో భాగంగా మంగళగిరి నుండి వచ్చిన డిప్యూటీ డైరెక్టర్ అఫ్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసరెడ్డి మండలంలోని ల్యాండ్ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పలువురు రైతులతో ఆయన మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎన్. గురుమూర్తి రెడ్డి, రిసర్వే డిటి రాహేలు, ఆర్ ఐ గణేష్, వీఆర్వోలు, విఎస్ లు రైతులు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-పామర్రు : జీఎస్టీ తగ్గింపుతో వాహన రంగంపై వ్యయం తగ్గిందని ఉయ్యూరు ప్రాంతీయ రవాణా శాఖ అధికారి సుబ్బారావు తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ అధికారి తుంగల మారుతీ రావు అధ్యక్షతన రవాణా శాఖ ఏర్పాటు చేసిన 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వాహనాలపై జీఎస్టీ తగ్గించడం పట్ల అన్ని రకాల వాహన యజమానులకు లాభదాయకంగా ఉంటుందని వివరించారు. సహాయ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షేక్ ఆయుష స్మాని, జీఎస్టీ అధికారి సలాం,పామర్రు పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ సలీం, మార్కెట్ యార్డు చైర్మన్ జున్ను శోభన్ బాబు, డైరెక్టర్ నూకవరపు వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు. తొలుత నాలుగు రోడ్ల కూడలి నుండి జీఎస్టీ అమలపై జరిగే ప్రయోజనాలు వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో సూపర్ జీఎస్టీ ం-సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ ర్యాలీని ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిఎస్టి స్లాబులు సవరించి అన్ని వస్తువులతో పాటు ద్విచక్ర వాహన కొనుగోలుదారులకు సైతం ధరల వెసులుబాటు కల్పించాలని, సరుకు రవాణా వాహనాలపై 28 శాతం ఉన్న జీఎస్టీ ఇప్పుడు 18శాతానికి తగ్గించారన్నారు. క్రమర్షియల్ టాక్స్ అసిస్టెంట్ డిప్యూటీ కమిషనర్ స్వరూప రాణి ,రవాణాశాఖ అధికారి లోకనాథ్ ప్రసాద్, టిడిపి నాయకులు బండే రాఘవ, అశ్వరావు పాలెం మాజీ సర్పంచ్ కె.మధుసూదన్‌రావు పాల్గొన్నారు.



పామర్రులో...



అవనిగడ్డలో..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన గన్నవరంలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బాపులపాడు మండలం కోడూరుపాడు గ్రామానికి చెందిన రిటైర్డ్ రైల్వే ఉద్యోగి గరికపాటి సుబ్బారావు గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పక్కన ఉన్న రైతు బజార్లో కూరగాయలు కొనుగోలు చేసి వెళుతుండగా 16వ నంబర్ జాతీయ రహదారి మీదకు రాగానే విజయవాడ నుండి ఏలూరు వైపు వెళుతున్న లారీ ఢీకొని ఢీకొంది. దీంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి-చల్లపల్లి : గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం అమలు చేయాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్రాపు పోలినాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 20వ తేదీన గన్నవరంలో జరిగే కష్ణా జిల్లా 9వ మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యల పట్ల ఉద్యోగుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరి పై కార్మిక వర్గం పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ గ్రామాభివద్ధి పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తుందని ఆరోపించారు. కార్మికులు పోరాడే సాధించుకున్న జీవోలు 57 132 142 680 లను అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. గన్నవరంలో జరిగే మహాసభకు కార్మికుల తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మహమ్మద్ కరీముల్లా, ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ చల్లపల్లి మండల సహాయ కార్యదర్శి శాంతల జయలక్ష్మి, కొమ్ముకూరి రాజేశ్వరరావు, గోవిందు, ఆర్ ఐ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సిపిఆర్ పై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు హదయ శ్వాసకోశ పునరజీవనం (సిపిఆర్) వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మధ్యకాలంలో చిన్న వయసులోనే వ్యక్తులు గుండె జబ్బులు కు గురై చనిపోవడంతో ప్రభుత్వం సిపిఆర్‌పై యువతలో అవగాహన కల్పించడానికి వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జూనియర్ కళాశాలలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. ఎన్ఎల్‌హెచ్‌పి ప్రియాంక విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ దొరబాబు, హెల్త్ సూపర్వైజర్ కే తారక రామారావు, లెక్చరర్లు కే నాగరాజు, చంద్రశేఖర్, ఏఎన్ఎం అరుణ కుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యాన స్థానిక లయన్స్ సేవాభవన్‌లో గురువారం నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మండా వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు నిరుపేదలకు అన్నదానం చేశారు. అలాగే పేదలకు దుప్పట్ల పంపిణీని చేపట్టారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు వైపీసీ ప్రసాద్, పెరుమాళ్ళు, నవాబు తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



విజయవాడ : పోషక ఆహారం తీసుకోవడం వల్ల పిల్లల్లో ఎదుగుదల, జ్ఞాన వికాసం మెరుగుపడుతుందని ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఫాదర్ అంతయ్య తెలిపారు. నవజీవన్ సంస్థ ఆధ్వర్యంలో గురువారం నీతోడు మానసిక వికాస కేంద్రంలో "న్యూట్రిషన్ ప్రోగ్రాం" నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ అంతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "వెనుకబడిన తరగతుల పిల్లలు సరైన ఆహారం తీసుకోకపోవడం వలన శారీరక ఎదుగుదలతో పాటు మానసిక వికాసం కూడా తగ్గిపోతుందని, రాగి పిండి ద్వారా తయారు చేసిన జావా, పప్పు దినుసులు వంటి పోషక ఆహారం తీసుకోవడం వల్ల పిల్లల ఎదుగుదల, జ్ఞాన వికాసం మెరుగుపడుతుందని తెలిపారు. కమ్యూనిటీ స్థాయిలో ఈ ఆహార అలవాట్ల మార్పు పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది" అని తెలిపారు. ప్రోగ్రాం మేనేజర్ ఎండి వసంతకుమారి మాట్లాడుతూ "రాగి పిండితో లడ్డూలు తయారు చేసి ఇవ్వడం ద్వారా పిల్లలకు సరైన న్యూట్రిషన్ అందించవచ్చు" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సు సునీత, టీచర్లు తిరుపతమ్మ, సుజాత, మేరీ, పెద్దింట్లమ్మ, పావని తదితరులు పాల్గొన్నారు.

సిపిఆర్‌పై అవగాహన వారోత్సవాలు



ప్రజాశక్తి-జగ్గయ్యపేట: సమాజంలో ప్రాణరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ప్రతి సంవత్సరం జరుపుకునే "సిపిఆర్ అవగాహన వారోత్సవం" (సిపిఆర్ అవేర్నెస్ వీక్)ను ఈ ఏడాది జగ్గయ్యపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గుండెపోటుకు గురైనప్పుడు సిపిఆర్‌ను ఉపయోగించి ప్రాణాలను రక్షించవచ్చు. ఈ వారోత్సవం సందర్భంగా వైద్య అధికారులు, నర్సులు, ఆరోగ్య సిబ్బంది ప్రదర్శనలు, అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్య అధికారి మాట్లాడుతూ "ప్రతి వ్యక్తి సిపిఆర్ పద్ధతుల గురించి అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా హరిక్రిష్ణ, డా హరీష్, డా రాజేశ్వరి, డా రాజ్ కుమార్, డా జ్యోత్న్న పాల్గొన్నారు.

డ్రాయింగ్‌లో నాగార్జున విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని నాగార్జున హైస్కూల్ ఆధ్వర్యంలో ఈనాడు ప్రతిభా-పాటవ పోటీల్లో భాగంగా జగ్గయ్యపేటకు చెందిన 8, 9, 10వ తరగతి విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మొదటి బహుమతి జి.పల్లవి (9వ తరగతి), రెండవ బహుమతి బి మనవిత (9వ తరగతి), మూడవ బహుమతి షేక్ షాఖత్ అమీర్ (తొమ్మిదవ తరగతి), కానసొలేషన్ బహుమతులు ఎంఎల్ లాస్య (పదవ తరగతి), కె.ఎన్.వి.మురళి (8వ తరగతి), ఎస్.కె జాఫర్ సాధికార్ (ఎనిమిదవ తరగతి) పొందారు. బహుమతులు పొందిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపల్ చావా కష్ణయ్య చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

24న సదస్సు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం
నకిలీ ఎరుకుల సర్టిఫికెట్ల రద్దుపై ఈ నెల 24న విజయవాడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న సెమినార్‌ను విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకురాలు, అధికార ప్రతినిధి చినుకుని విజయ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ సెమినార్‌కు మాజీ ఎస్టీ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కుంభ రవిబాబు, గిరిజన నేత కొండారెడ్డి నరహరి, ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నా లక్ష్మణరావు, తదితర ఎస్టీ నాయకులు హాజరై ప్రసంగిస్తారని తెలిపారు. ఇందులో నకిలీ సర్టిఫికెట్లు ఏ మార్గాల ద్వారా సంపాదిస్తున్నారు? ఎవరు సిఫార్సులు చేస్తున్నారు? అనే విషయాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు.

పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని పెంచాలి

- సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు



ప్రజాశక్తి - విజయవాడ సిటీ : 50వ డివిజన్ పరిధిలో గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వివిధ వార్డుల నుండి 50 మంది కార్మికులను అదనంగా నియమించి నాలుగు సచివాలయాల పరిధిలోని డ్రైనేజీలలో పూడికతీత పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బి సత్యబాబు మాట్లాడుతూ నగర జనాభా విపరీతంగా పెరిగిన క్రమంలో పారిశుధ్య నిర్వహణకు తగిన స్థాయిలో సిబ్బంది లేకపోవడంతో నగర అవసరాల మేరకు పారిశుధ్య పనులు సమర్థవంతంగా జరగడం లేదన్నారు. నగరపాలక సంస్థ కాంట్రాక్ట్ కార్మికుల నియామక హక్కులను సైతం రాష్ట్ర ప్రభుత్వం కాలరాయడం అన్యాయమన్నారు. మురుగు కాలవలలో పూడికతీత పనులు సక్రమంగా నిర్వర్తించకపోవడంతోపాటు నగరం మీదుగా వెళ్లే రైల్వే ట్రాక్‌ల కింద మ్యాన్ హెూల్ షీల్ట్ రెగ్యులర్గా తొలగించ లేకపోవడం, బుడమేరు కాలువ షీల్డ్ తొలగింపు విస్తరణ చేపట్టకపోవడంతో నగరంలో మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా మారిందని ధ్వజమెత్తారు. ప్రజానీకం కూడా పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంలో సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 50 డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ ఎస్ ఎస్ సోమశేఖర్, సచివాలయం సానిటరీ సెక్రెటరీ ఎం. రవిశంకర్ పాల్గొన్నారు.



మోడల్ స్కూల్ సందర్శన

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండల పరిధిలోని మద్దులపర్వలో మోడల్ స్కూల్, కాలేజీని ఎంపిపి రామినేని దేవి ప్రవణ్య వీరస్వామి నాయుడు గురువారం అధికారులతో కలిసి సందర్శించారు. పాఠశాలలో భోజనం, తరగతి గదులు, వసతి, పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాఠశాల, కళాశాలల మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ టికెవి రమణ, ఈఓపిఆర్డీ ప్రభాకర రావు, టిడిపి నాయకులు వీరస్వామినాయుడు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఏ కొండూరు :
అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ఉత్పత్తులపై విధిస్తున్న అధిక సుంకాలకు వ్యతిరేకంగా సిపిఎం ఏ కొండూరు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం చీమలపాడు మెయిన్ సెంటర్‌లో నాయకులు కార్యకర్తలు గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్ విధించిన సంకాల వల్ల కలిగే ఇబ్బందులను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు, నాయకులు జెట్టి వెంకటే శ్వరరావు, ఆళ్ల అమ్మిరెడ్డి ఎస్. ఆనందరావు, పి.లెనిన్, ఎం.వెంకటేశ్వరరావు, జరబల చంటి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రతతో అంటువ్యాధులను నివారించొచ్చు : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్, యూనిసెఫ్‌లచే సంయుక్తంగా విజయవాడలోని పున్నమి ఘాట్‌లో జిల్లా స్థాయి గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కలెక్టర్ జి లక్ష్మీశ, జేసీ ఇలక్యా , ఆదాయపు పన్ను కమిషనర్ ప్రకాష్, పిడి ఐసిడిఎస్ ఎస్కె రుక్సానా సుల్తానా బేగంలు హాజరయ్యారు. మనోజ్ కుమార్ లీడ్ వాష్ ఫ్రం %ఎజభీ%, గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే యొక్క ప్రాముఖ్యత మరియు అది రోజువారీ ఆరోగ్య జీవితాన్ని మరియు హ్యాండ్ వాష్ పై గణాంకాలను ఎలా ప్రభావితం చేస్తుందనే విషయాలను వివరించారు. జేసీ ఇలక్కియా, ఆదాయపు పన్ను కమిషనర్ ప్రశాంత్ చేతుల పరి శుభ్రతతో వ్యాధులను నివారించడం ద్వారా చేకూరే ప్రయోజనాలను వివరించారు.అనంతరం గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీష ప్రేక్షకులను ఉద్దేశించి ప్రసంగిస్తూ అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా చేతుల పరిశుభ్రత ప్రాముఖ్యతోపాటు ఆవశ్యకత వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో పాల్గొన్న విద్యార్థులు రూపొందించిన డ్రాయింగ్‌లు, నినాదాలను ఆయన ప్రశంసించారు. విద్యార్థుల సజనాత్మక వ్యక్తీకరణలను సమాజ పరిశుభ్రత యొక్క విస్తృత సందేశానికి అనుసంధానించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆశాలు మరియు ఎఎన్ఎంలు అంగన్‌వాడీ మరియు పాఠశాల స్థాయిలలో పిల్లలలో చేతులు శుభ్రం చేసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కలెక్టర్ వ్యాఖ్యానించారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమంలో డ్రాయింగ్ పోటీల విజేతలకు ముఖ్య అతిథులు బహుమతులు ప్రదానం చేశారు.గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే -2025 కి సంబంధించిన ఐక్ మెటీరియల్స్, పోస్టర్లు, స్టిక్కర్లను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, అధికారులు ప్రారంభించారు.

'సూపర్ జిఎస్‌టిపై ర్యాలీ

ప్రజాశక్తి - తిరువూరు : రవాణా శాఖ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమాన్ని తిరువూరు లో గురువారం అధికారులు నిర్వ హించారు. ముందుగా బైపాస్ రోడ్డు, వినాయక దేవలయం సెంటర్ లో అవగాహన ర్యాలీని ఆర్డీ ఓ మాధురి జెండా ఊపి ప్రారంభించారు. మధిర రోడ్డు వరకు వివిధ వాహనాలతో ర్యాలీ నిర్వ హించారు రవాణా, లాజిస్టిక్స్ రంగానికి జీఎస్టీ మినహాయింపు ఎంతో ఉపయోగమని ఆర్డిఓ పేర్కొన్నారు. వాహనాల కొనుగోలు, నిర్వహణ ఖర్చు తగ్గిందని, సులభమైన పన్నులను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నిర్మల, కమిషనర్ మనోజ, ఎంపీడీవో రవిబాబు, రవాణా శాఖ అధికారులు శివరాం గౌడ్, వర్మ పాల్గొన్నారు.

ప్రజలకు సేవలందించాలి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. ఎంపిపి రామినేని దేవిప్రవణ్యవీరస్వామినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారులందరూ తమ వంతుగా ప్రజలకు సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు పాలంకి విజయ భాస్కర్ రెడ్డి, ఎంపిడిఓ టి కె వి రమణ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జీవన ఎరువులపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని మక్కపేట, భీమవరం గ్రామాల్లో జీవన ఎరువుల వినియోగంపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సేద్య విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ పి.ఎన్. శివ ప్రసాద్ మాట్లాడుతూ ద్రవ, ఘన రూప జీవన ఎరువులు వాడటంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. మిరపలో సమగ్ర సస్య రక్షణ చర్యలపై డాక్టర్ కె.లక్ష్మి కళ పాల్గొని వివరించారు. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఆర్ ప్రభావతి శిలీంద్ర నాశనులు వాడేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని శనగపాడు, వెంగనాయకుని పాలెం గ్రామాల్లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జయప్రద ఫౌండేషన్ చైర్మన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో ప్రజలు కంటి పరీక్షలు, జనరల్ పరీక్షలు, బిపి, షుగర్‌లో చూపించుకోవాలని అన్నారు.

కోటి సంతకాలకు అపూర్వ స్పందన



ప్రజాశక్తి విజయవాడ సిటీ : పశ్చిమ నియోజకవర్గ ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు ఆదేశాలతో గురువారం భవానిపురం కాంబేవే రోడ్‌లో 40వ డివిజన్ కార్పొరేటర్ యరడ్ల ఆంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. కూటమి ప్రభుత్వం పేదలకు వైద్యం వైద్య విద్యను దూరం చేయాలనే కుట్రతో పిపిపి విధానం తీసుకువచ్చిందని ధ్వజమెత్తారు. వైద్య కళాశాలలను ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కొనసాగాలని కోరుతూ కోటి సంతకాల కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇంచార్జ్ కేసరి కష్ణారెడ్డి, పార్టీ సీనియర్నేత వై సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా నిరసన



ప్రజాశక్తి ఎ.కొండూరు : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత ఉత్పత్తులపై విధిస్తున్న అధిక సుంకాలను నిరసిస్తూ గురువారం మండలంలోని చీమలపాడు మెయిన్ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి పానెం ఆనందరావు మాట్లాడుతూ.. అమెరికా నిర్ణయాల వల్ల రాష్ట్ర ఆక్వా, టెక్స్‌టైల్, గార్మెంట్స్ రంగాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొయ్యల ధరలు గణనీయంగా పడిపోవడంతో తీరప్రాంత రైతులు ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడ్డారని, గార్మెంట్స్ మిల్లులు, ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న వేలాది మహిళా కార్మికుల ఉపాధి ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు. భారతదేశ వాణిజ్య ఎగుమతి, దిగుమతులపై ట్రంప్ విధించిన సుంకాల టారిఫ్‌లను తక్షణమే రద్దు చేయాలని, అమెరికా ఆంక్షల పట్ల మోడీ ఉదాసీన వైఖరి విడనాడాలని అన్నారు. రైతులు, కార్మికులు నష్టపోతున్నా కేంద్ర ప్రభుత్వానికి కనీసం ఆవేదన కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు జెట్టి వెంకటేశ్వరరావు, సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ఆళ్ళ అమ్మిరెడ్డి, ఎస్. ఆనందరావు,పి.లెనిన్ వెంకటేశ్వరావు, జరబల సంటి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వై. వెంకటేశ్వరరావు

వెంకటరత్నం సేవలు ఆదర్శనీయం

- సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై. వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఉంగుటూరు : నిరంతరం పేదల పక్షాన పోరాటం చేసిన వెంకటరత్నం ఆదర్శనీయుడని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై ఎంకటేశ్వరరావు అన్నారు. సిపిఎం నాయకులు పాలడుగు వెంకటరత్నం సంస్మరణ సభ గురువారం సావరగూడెం గ్రామంలోని ఆయన స్వగృహంలో గురువారం జరిగింది. సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో పాల్గొన్న వై.వెంకటేశ్వరరావు మాటా్ల్డుతూ వెంకటరత్నం చివరి వరకు అనేక కష్టాలు ఎదుర్కొని కమ్యూనిస్టు జీవితాన్ని జీవించారన్నారు. ఆయన బీసీ కాలనీ ఏర్పాటు ఆయన చేసిన విశేష కృషి చేశారన్నారు. ఏలూరు కాలువ నుండి సావరగూడెం ప్రాంతం ఆయకట్టుకు నీటి సౌకర్యం కల్పించడానికి సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రమదాన కార్యక్రమాల్లో వెంకటరత్నం పాత్ర కీలకమైందని, మరువలేనిదని అన్నారు. జూదం, మద్యం లాంటి వ్యసనాలకు వ్యతిరేకంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పాటలు నేర్పించడం, పోటీలు నిర్వహించడం ద్వారా యువతను పెడదారి పట్టకుండా చేశారన్నారు. మహిళా సాధికారతకు అక్షరాస్యతే ప్రాథమిక మార్గమని దఢంగా నమ్మిన వెంకటరత్నం, వయోజన విద్యా కార్యక్రమాల్లో మూడు దశాబ్దాల క్రితమే చురుకుగా పాల్గొన్నారని తద్వారా మహిళలకు విద్యను అందించడంలో ముఖ్య పాత్ర నిర్వహించారని అన్నారు. రైతుసంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు మాట్లాడుతూ వెంకటరత్నంకు తెలియనిది కులం, మతం, ప్రాంతం వంటివని, దానికి అతీతంగా సమానమైన, న్యాయమైన సమాజం నిర్మాణం కోసం చివరి వరకు కృషి చేశారని అన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వై నరసింహారావు మాట్లాడుతూ ముస్తాబాద పార్టీకి కంచుకోట అని, అలాంటి కంచుకోటతో కలిసి సవారుగూడెంలో పార్టీని బలోపేతం చేయడం కానీ, ప్రజాసంఘాలు నిర్మించడంలో, పేదలకు ఇళ్ళస్థలాలు ఇప్పించడం కోసం జరిగిన పోరాటాలలో వెంకటరత్నం కీలక పాత్రపోషించే వారని అన్నారు. మహిళలను పార్టీలో కొనసాగించడానికి ముందుగా ఆయన కుటుంబం నుండి ఆయన బిడ్డలను తీసుకొని వచ్చి ప్రజాసంఘాల బాధ్యత నిర్వహించేలా చేయడంలో ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు, ప్రజానాట్యమండలి నాయకులు రామినేని రవిబాబు, రంగారెడ్డి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న షాహిద్ బాబు షేక్

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

- ఎస్‌సి కార్పొరేషన్ ఇన్‌ఛార్జి ఈడి షాహిద్ బాబు షేక్

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : షెడ్యూల్డ్ కులాల వారికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కలిగి వాటిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఇంచార్జి కార్యనిర్వహక సంచాలకులు షాహిద్ బాబు షేక్ తెలిపారు. ఎస్ సి.కార్పొరేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల వారికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా షాహిద్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ తో కూడిన సంక్షేమ పథకాలు వివిధ శాఖల ద్వారా అమలు చేస్తుందని కాబట్టి పథకాల పై ఆయా వర్గాల వారు పూర్తి అవగాహన కలిగి వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలతో పాటు విదేశాలలో చదువు కొవడానికి 20 నుండి 30 లక్షల రూపాయలు వరకు ఎడ్యుకేషన్ ఋణాలు ఇస్తుందన్నారు. ఈ ఋణాన్ని మరల పది సంవత్సరాల లోపు తిరిగి చెల్లించే వెసులుబాటు ఉందన్నారు. అలాగే పరిశ్రమల శాఖ ద్వారా చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటు,అలాగే ప్రస్తుతం చేస్తున్న వ్యాపారాలు విస్తరణ మరియు అభివద్ధి, వ్యవసాయనికి ఇలా అనేక రకాల పథకాలు అమలు చేస్తుం దని కాబట్టి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు పథకాలను అందిం చుకోవాలని సూచించారు. జిల్లా గ్రామీణ అభివద్ధి శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వై హరిహర నాథ్, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గుమ్మడి విద్యా సాగర్, కూటమి నాయకులు వంపు గడవల చౌదరి, పరిశ్రమల శాఖ, మత్యశాఖ, బ్యాంక్ మేనేజర్లు పాల్గొన్నారు.

పన్నులే అభివృద్ధికి దోహదం

- కెయు ఉకులపతి ఆచార్య కె. రాంజీ



మాట్లాడుతున్న విసి కె.రాంజీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ప్రజలు సకాలంలో పన్నులు చెల్లిస్తేనే ప్రభుత్వాలు అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతాయని, అంతిమంగా మనం చెల్లించే పన్నులే అభివృద్ధికి దోహదపడతాయని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. గురువారం మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యములో సూపర్ జి ఎస్ టి సూపర్ సేవింగ్స్ పై నిర్వహించిన అవగాహన సదస్సు లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిఎస్‌టి పన్నులను నాలుగు స్లాబుల నుండి రెండు స్లాబులకు కుదించడం గొప్ప సంస్కరణ అని అన్నారు. అయితే విద్యాసంస్థలను దృష్టిలో పెట్టుకొని కొన్ని వెసులబాట్లు ఉంటే బావుంటుందని అశాభావం వ్యక్తం చేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ట్యాక్సెస్ స్వరూప రాణి సోదాహరణంగా జిఎస్‌టిపై అవగాహన కల్పించి, విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. మేనేజ్మెంట్ విభాగాధిపతి డా ఎం. శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ ఉష, ఆచార్య మారుతి, ఆచార్య దిలీప్, పలువురు సహాయ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో ధాన్యం కొనాలని వినతి



ప్రజాశక్తి-బంటుమిల్లి : ధాన్యం పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, బంటుమిల్లి మెయిన్ కాలవ పంట సాగుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బంటుమిల్లి తహశీల్దార్ కాగిత పూర్ణచంద్రరావుకు రైతుసంఘం ఆధ్వర్యంలో నాయకులు గురువారం వినతిపత్రం అందించారు. ఖరీఫ్ పంటకు వచ్చే దిగుబడి 55 శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని మిగతా ధాన్యాన్ని బహిరంగంగా రేట్లు అమ్ముకోవాలని ప్రకటించడం తగదని నాయకులు అన్నారు. ఇది దురదష్టకరమని, మొత్తం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వాలని, దాళ్వా పంటకు నీరు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో రైతు సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి గౌరీశెట్టి నాగేశ్వరావు, వెంట్రుపాటి సురేష్, ఆంజనేయులు, లంకదాసుల అజయ్ ఘోష్, వంగల రాజు, సుజ్ఞానం జనార్ధన్ రావు, గౌరిశెట్టి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం యంత్రాలు తక్షణం సరఫరా చేయాలి



భీమవరపు సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-ఉంగుటూరు : ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా ఉంగుటూరు మండలంలో ఉన్న 12 కొనుగోలు కేంద్రాలలో డ్రయర్ యంత్రాలు (ధాన్యం ఆరబెట్టే యంత్రాలను) సరఫరా చేయడం ద్వారా రైతులకు ప్రయోజనకరంగా, నష్టం లేకుండా ధాన్యం అమ్మకానికి వీలు కల్పించవచ్చని తేలప్రోలుకు చెందిన ఆదర్శ రైతు భీమవరపు సుబ్బారెడ్డి గురువారం ఆయన ఒక ప్రకటనలో అన్నారు. ఉంగుటూరు మండలంలో 26 వేల ఎకరాల్లో వరి పంట సాగులో ఉందని, ఇంకా 40 రోజుల్లో వరి కోతలు ప్రారంభం కానున్న తరుణంలో ఈ మండలంలో 80 శాతం మంది కౌలు రైతులు, 20 శాతం మంది భూయజమానులు వరి సాగు చేస్తున్నారన్నారు. రైతుల్లో నూటికి 90 శాతం మంది యంత్రాల ద్వారా కోతకు ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. యంత్రం ద్వారా వరి కోత, ధాన్యం ఆరబెట్టడం, తేమ శాతాన్ని తగ్గించడం, కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్మకం చేయడం వరుస ప్రక్రియ అన్నారు. కానీ ఈ ప్రక్రియ రైతులు, కౌలు రైతులకు అత్యధిక ఖర్చుతో కూడుకున్న పనిగా మారిందన్నారు. అలాగే, వాతావరణంలో వస్తున్న మార్పు లను తట్టుకుని ధాన్యం అమ్మడం కూడా కష్టంతో కూడుకున్న పని అయిందన్నారు. ఈ పరిస్థిఉల్లో డ్రయర్ యంత్రాల తక్షణ సరఫరా చాలా అవసరం అని అన్నారు.కోతలు ప్రారంభం కావడానికి ఇంకా 40 రోజుల సమయమే ఉంది కావునా ఈ సమయంలోనే డ్రయర్ యంత్రాలు సరఫరా చేస్తే రైతులు వాటిని ఉపయోగించుకునే విధంగా సిద్ధం చేసుకోవచ్చున్నారు. అలాగే ప్రస్తుతం వాతావరణంలో అనూహ్య మార్పులు చోటుచేసుకుంటున్నాయని, అకస్మాత్తుగా వర్షాలు పడినా, డ్రయర్ యంత్రాలు ఉంటే తడి ధాన్యాన్ని కూడా రక్షించుకోవచ్చున్నారు. అలాగే ప్రభుత్వమే ఈ యంత్రాలను సరఫరా చేస్తే ఈ ఖర్చు తగ్గించడంతో పాటుగా ప్రతి రైతుకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కాబట్టి, వ్యవసాయ శాఖ వెంటనే చర్య తీసుకుని, మండలంలోని 12 కొనుగోలు కేంద్రాల ద్వారా తగిన సంఖ్యలో డ్రయర్ యంత్రాలు సరఫరా చేయాలన్నారు.



కరకట్టల నిర్మాణంలో ఎంవి కృష్ణారావు కీలకపాత్ర

ప్రజాశక్తి-అవనిగడ్డ : కరకట్టల నిర్మాణంతో దివి తీరానికి ఎంవి కృష్ణారావు రక్షణ కల్పించారని నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం కొనియాడారు. గురువారం అవనిగడ్డ వంతెన సెంటర్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలలో భాగంగా మోపిదేవి మండ లం నాగయ్యతిప్ప గ్రామ కూటమి నాయకులు కృష్ణారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకట్రాం మాట్లాడుతూ నియోజక వర్గంలో వ్యవసాయ రంగ విస్తరణ, పరిరక్షణకు కృష్ణారావు విశేష కషి చేశారన్నారు. 1977 లోనే పులిగడ్డ ఆక్విడెక్టుకు ఆదనపు తొట్టె నిర్మించి అదనంగా 70 వేల ఎకరాలను సాగులోకి తీసుకు వచ్చారన్నారు. విస్తరణకు అనుకూలంగా కాలువలు ఆధునికరించి రెగ్యులేటర్లు నిర్మించారని తెలిపారు. సాగునీటితోపాటు 45 గ్రామాలకు తాగునీటిని కూడా ఈ ఆక్విడెక్ట్ ద్వారా సమకూర్చిన ఘనత కృష్ణారావుకే దక్కుతుందని వెంకట్ రామ్ ప్రశంసి ంచారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు అన్నపురెడ్డి లక్ష్మీనారాయణ, గాంధీ క్షేత్రం కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, జనసేన మోపిదేవి మండల పార్టీ అధ్యక్షులు పోషడుపు రత్న గోపాల్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్ రావు, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మాచవరపు ఆదినారాయణ పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ఉద్యోగాలకు 'విజయక్రాంతి' విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రముఖ సాఫ్ట్ వేర్ కంపెనీ టిసిఎస్ నిర్వహించిన అర్హత పరీక్షల్లో చల్లపల్లి విజయక్రాంతి డిగ్రీ కళాశాల విద్యార్థులు 27 మంది అర్హత సాధించారని ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్ తెలిపారు. అడపా నవ్య శ్రీ,, బొర్రా వైష్ణవి,గోళ్ళ వాసవి ప్రజ్ఞ,యార్లగడ్డ హర్షిత ప్రియ, బుర్రె ఐశ్వరయ్య, కమతం అస్మితలు అత్యుత్తమ ప్రతిభ కనపర్చారని, 21 మంది విద్యార్థులు 60 శాతం కంటే అధిక మార్కులు సాధించారన్నారు. ఉద్యోగఅర్హత సాధించిన విద్యార్థినీ విద్యార్థులను గురువారం కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు ప్రిన్సిపాల్ దుట్టా శివరామ ప్రసాద్, అధ్యాపకులు ఎంఎస్ ఆర్, మత్తి సూర్యప్రసాద్ ఇంచార్జి కె.సత్యనారాయణ లు అభినందించారు.

ధాన్యం రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కోసూరు శివ నాగేందర్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని వీరంకిలాకులలో ఆయన మాట్లాడుతూ ధాన్యం రైతులకు మద్దతు ధర ఇవ్వాలని, ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కౌలు రైతులను కూడా ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏనుగుదాటి బసవరాజు, శొంటి లక్ష్మణ్, సుబ్బారావు, శ్రీనివాసరావు, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాశక్తి-వీరులపాడు : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు మండల కేంద్రంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జెల్లీ ఏసోబు కమ్యూనిటీ హాల్లో జాతీయ పోషక ఆహార మహోత్సవం ఎండిఓ రూపవతి ఎంపీపీ కోటేరు శ్రీలక్ష్మి ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రభావతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కోటేరు శ్రీలక్ష్మి మాట్లాడుతూ పౌష్టిక ఆహారం తీసుకోవడం వల్ల రక్తహీనత, తదితర అనారోగ్య సమస్యలు నివారించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు పోషక ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం చిరు ధాన్యాలతో తయారుచేసిన వంటలను పరిశీలించి పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం నిర్వహించారు. టాటా టెస్ట్ భాగ్యలక్ష్మి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రభావతి, అంగన్వాడి టీచర్లు పసుపులేటి వాసవి, షేక్ నజీమా, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శి రాముకు పితృవియోగం

ప్రజాశక్తి-వత్సవాయి : సిపిఎం వత్సవాయి మండల కార్యదర్శి బి రాముకు పితృవియోగం కలిగింది. ఆయన తండ్రి బొడ్డు బాబు(65) అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు బి రాము సిపిఎం మండల కార్యదర్శిగా పని చేస్తున్నారు. బాబు మృతదేహాన్ని సిపిఎం సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, సిపిఎం జగ్గయ్యపేట మండల కార్యదర్శి సోమోజు నాగమణి, నాయకులు కోటా కష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, లింగారావు, రమనాదం, ప్రజాశక్తి విలేఖరి జజ్జవరపు వెంకటరావు, జాన్ కోటయ్య, ఏసు పోగు వెంకటరత్నం, పీఈటి బాబురావు, పెనుగంచిప్రోలు సిఐటియు మండల కార్యదర్శి ధారా నాగేశ్వరరావు, జడ్పిటిసి ఏసు పోగు శ్రీనివాసరావు, న్యాయవాది కరిచే రత్నబాబు సందర్శించి నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



టెక్నాలజీపై ఆసక్తి పెంచుకోవాలి



ప్రజాశక్తి-వత్సవాయి : విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీపై ఆసక్తి పెంచుకొని శాస్త్రవేత్తలుగా ఎదగాలని జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డి శ్రీను అన్నారు. స్థానిక ఎస్‌ఎస్పిఎం జడ్పీ బాలికల హైస్కూల్లో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధ్యాయ సేవాదళ్ తరపున పెనుగంచిప్రోలు మండలాన్ని దత్తత తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని సైన్స్ ఉపాధ్యాయులను కలాం సైన్సు పురస్కారాలతో, 22 మంది విద్యార్థులను జూనియర్ సైంటిస్టుల పేరుతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నక్క బాబురావు, డెమొక్రటిక్ పిఆర్టియు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని ముండ్లపాడు విజయ డైరీ పాలకేంద్ర సభ్యురాలు జంగాల వెంకట నరసింహ ఇటీవల మృతి చెందారు. వెంకట నరసింహ కుటుంబ సభ్యులకు విజయ డైరీ జిల్లా కేంద్రం నుంచి మంజూరు చేసిన రూ.50 వేల చెక్కును సంఘం చైర్మన్ కొత్తపల్లి రమనాదం, ఎంపిపి గుంటుపల్లి వాసు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ నరేంద్ర, సూపర్వైజర్ నరసింహారావు,, రామకష్ణ, కోటి బాబు, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి : సిఐటియు



ప్రజాశక్తి- నందిగామ : విద్యుత్ ఉద్యోగుల కార్మికుల సమస్యలపై అక్టోబర్ 18 నుండి జరిగే సమ్మెలో పాల్గొనాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు కటారపు గోపాల్ పేర్కొన్నారు. యునైటెడ్ ఎలక్ట్రికల్ సిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) పిలుపు మేరకు గురువారం చందాపురం సబ్ స్టేషన్ వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పిఆర్సి ఏరియాస్ ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న నాన్ రెగ్యులర్ ఉద్యోగులందరినీ అన్లిమిటెడ్ వైద్య సౌకర్యం కోటి రూపాయలు ఇన్సూరెన్స్ పథకం రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జెఎల్ఎం గ్రేడ్ 2 ఉద్యోగులకి ఏపీఎస్సిబి సర్వీస్ రూల్స్‌ను వర్తింపజేయాలని, ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్ డిఎ వెంటనే విడుదల చేయాలి, పిఆర్సి కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉద్యోగ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 18 నుండి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని, ఈ సమ్మెల్లో విద్యుత్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్, పీస్ రేట్ మీటర్ రీడర్స్, నాన్ రెగ్యులర్, ఉద్యోగులందరూ ఈ సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగ నాయకులు బి శ్రీనివాస్, కిషోర్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.'

ఘనంగా ఆహార దినోత్సవం

ప్రజాశక్తి-మైలవరం : స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగారావు మాట్లాడుతూ ప్రతి ఏడాది అక్టోబర్ 16వ తేదీన ప్రపంచ ఆహార దినోత్సవం గా జరుపుకుంటున్నామన్నారు. ప్రపంచంలో ఆకలి చావులు సంభవించకుండా అందరికీ ఆహారం కల్పించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వ్యక్తిగతంగా ఆహారాన్ని వృధా చేయకుండా ఆకలితో ఉన్నవారికి అందించడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం



ప్రజాశక్తి-మైలవరం : విశాఖకు గూగుల్ డేటా సెంటర్ ను తీసుకువచ్చినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ మంత్రి నారా లోకేష్ చిత్రపటానికి గురువారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద మైలవరం నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు లంక లితీష్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ లోకేష్ కృషితో పలు కంపెనీలు రాష్ట్రానికి వస్తున్నాయని, దీంతో యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని తెలిపారు.



గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-మైలవరం : గర్భిణీలు, బాలింతలు పౌష్టికరమైన ఆహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ రుక్సానా బేగం అన్నారు. గత నెల రోజులుగా జరుగుతున్న పోషక మాసోత్సవాలు ముగింపు కార్యక్రమం గురువారం వెల్వడంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు డాక్టర్ల సలహాలను పాటిస్తూ ఉండాలని పుట్టబోయే బిడ్డలు కూడా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పుష్పలత, సూపర్వైజర్ జోజికటాక్షం, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్వాడి హెల్పర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిఘంటువుల వినియోగంపై అవగాహన



ప్రజాశక్తి - తిరువూరు : నిఘంటువును కూడా ఒక పాఠ్య పుస్తకంలా భావించి, నిరంతరం చూడటం అలవాటు చేసుకోవాలని ఏ.కొండూరు మండల మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాం ప్రదీప్ విద్యార్థులకు సూచించారు. నిఘంటువు దినోత్సవం సందర్భంగా పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు పంపిణీ చేసిన ఆంగ్ల నిఘంటువుల వినియోగంపై ఆయన గురువారం అవగాహన కల్పించారు. నిఘంటువును నిరంతరం చూడటం వల్ల ఆంగ్ల భాష పదాలపై పట్టు వస్తుందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.నాగేంద్ర రావు, వి.తేజస్విని, టీ.సుప్రియ తదితరులు పాల్గొన్నారు.



అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి-వత్సవాయి : ప్రజా సమస్యలపై అధికారులు సమన్వయంతో పనిచేయాలని మండల ప్రజా పరిషత్తు అధ్యక్షులు కొలుసు రమాదేవి అన్నారు. గురువారం వత్సవాయి మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కొలుసు రమాదేవి అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రామాల్లో అధికారులు మండల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సమావేశంలో జడ్పిటిసి సభ్యులు యేసపోగు దేవమణి, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీడీఓ జి.నితిన్, మండల స్థాయి అధికారులు, మండల పరిషత్ పరిపాలనాధికారి ఎన్.రాంబాబు, అన్ని గ్రామాల సర్పంచులు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎస్ క్రిష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



వాహన తనిఖీలు

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల పట్టణంలో గురువారం స్థానిక ఎస్ఐ పి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీలు చేశారు. హెల్మెట్ లేకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనదారులను, పరిమితికి మించి ద్విచక్రవాహనాలపై వెళ్తున్న వ్యక్తులను, సరైన పత్రాలు లేని వాహనదారులను పట్టుకొని వారి వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. సదరు వాహనదారులపై కేసులు నమోదు చేశారు. రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు వేగంగా వెళ్లకూడదని, అన్ని నిబంధనల ప్రకారం పేపర్‌లు ఉండాలని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : అవినాష్

ప్రజాశక్తి-కంచికచర్ల : రాష్ట్రం ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, అవినీతి పాలనపై ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలను చైతన్యం చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు దేవినేని అవినాష్ సూచించారు. కంచిక చర్లకు చెందిన వైసిపి సీనియర్ నాయకుడు కాలవ వాసుదేవరావు ఇటీవల వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు ఈ మేరకు స్థానిక నాయకులతో కలిసి విజయవాడలో ఎన్టీఆర్ జిల్లా వైసిపి అధ్యక్షుడు దేవినేని అవినాష్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలవ వాసుదేవరావును దేవినేని అవినాష్ సత్కరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను వంచించిందన్నారు. హామీల అమలు కోసం పార్టీ ఇచ్చే ఆందోళనా కార్యక్రమాలను విజయవంతం చేయడంలో నేతలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి షేక్ మలక్ బషీర్, కంచికచర్ల ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, పాల్గొన్నారు



పాఠశాలకు కంప్యూటర్ వితరణ

ప్రజాశక్తి-వత్సవాయి : పోలంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు ఆ గ్రామ సిపిఎం నాయకుడు చంద్రశేఖరరావు రూ.30 వేలు విలువ గల కంప్యూటర్‌ను విద్యార్థులకు అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జ్యోతి, రమేష్, దారెల్లి చిరంజీవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-వత్సవాయి : మండలంలోని మండ్లపాడు గ్రామంలో ఆ గ్రామానికి చెందిన భారతికి రూ.1,20,000, గుత్తా శ్రీనివాసరావుకు రూ.40 వేలు చొప్పున మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను జనసేన జిల్లా పార్టీ అధ్యక్షుడు సామినేని ఉదయభాను గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గూడపాటి లావణ్య, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, జనసేన ప్రముఖులు కోసి విష్ణు, గూడపాటి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

బోధనలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున కలెక్టర్ డికె బాబు

- కలెక్టర్ డికె బాలాజీ

ప్రజాశక్తి-పామర్రు : ప్రయోగాత్మకంగా భౌతిక శాస్త్రాన్ని అర్థమయ్యే రీతిలో వివరించే సులభ పద్ధతులను, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గురువారం పామర్రులోని ప్రగతి విద్యాసంస్థల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు క్వాంటం కంప్యూటర్స్ పై ఏర్పాటుచేసిన ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు న్యూటన్ గమన సూత్రాలు వంటివి కేవలం మాటలలో చెప్పడమే కాకుండా చేతలలో అర్థ మయ్యే విధంగా భౌతికంగా చూపిస్తే గుర్తుం టుందన్నారు. నిజజీవితంలో కూడా భౌతిక శాస్త్రం మనకు ఏ విధంగా అన్వయించుకోవచ్చు తెలియజేస్తే విద్యార్థుల్లో చైతన్యం నింపుతుందన్నారు. ఆంగ్ల భాషలో పట్టు సంపాదిస్తే కంప్యూటర్ పాటు అన్ని రంగాలలో సామర్థ్యం పెంచుకునే అవకాశం ఉంటుం దన్నారు. సమాచారం సాంకేతిక పరిజ్ఞానం చుట్టూనేడు ప్రపంచమంతా పరిభ్రమి స్తుందన్నారు. నేడు క్వాంటం కంప్యూటింగ్ అనే కొత్త సాంకేతిక పరిశోధన వైపు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్ర సమాచార సాంకేతిక ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి బి.సుందర్ ఈ కార్యక్రమంలో విజయవాడ నుండి వర్చువల్ గా పాల్గొని క్వాంటం కంప్యూటింగ్ గురించి కూలంకుషంగా వివరించారు. విశ్రాంత ఉపాధ్యాయులు భౌతిక శాస్త్ర నిపుణులు బి శివ నాగేశ్వరరావు, ఆఫ్ కాస్ట్ సమన్వయకర్త ఎం. శ్రీనివాసరావు భౌతిక శాస్త్రం,బ్లూప్రింట్, విశ్లేషణ తదితర అంశాలపై విశదంగా వివరించారు. అనంతరం 10 వ తరగతిలో భౌతిక శాస్త్రంలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించిన 24 మంది ఉపాధ్యాయులను, సాంకేతిక నిపుణులు సాయి చరణ్, దినేష్ లను జిల్లా కలెక్టర్ శాలువలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జిల్లా విద్యాధికారి పి విజయ రామారావు, ఉప విద్యాధికారి పద్మ రాణి, ప్రగతి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ పూర్ణచంద్రరావు, వారి సతీమణి నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీడీఓ ఇమ్రాన్

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని గ్రామ కార్యదర్శులంతా ప్రజలకు సేవ చేసేందుకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ తెలిపారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు జూనియర్ అసిస్టెంట్లకు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పంచాయతీల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సేవలకు అందుబాటులో ఉండే విధంగా మెరుగుదల, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, గ్రామ స్వచ్ఛత కార్యక్రమాలు, అలాగే గ్రామ సచివాలయాల కార్యకలాపాలపై కూడా సమీక్షను చేపట్టారు. మండలంలోని అందరు సచివాలయ సిబ్బంది ప్రభుత్వ పథకాల అమలులో మరింత చురుకుదనం ప్రదర్శించాలన్నారు. ప్రజలకు సమయానికి సేవలు అందించాలని సూచించారు.



గూగుల్ డేటా సెంటరు ఏర్పాటుపై హర్షం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రప్రదేశ్ ప్రజలకు గూగుల్ డేటా సెంటర్ రూపంలో చంద్రబాబు అందించిన వరం చరిత్రాత్మకమైందని అమెరికా తర్వాత భారతదేశంలో రెండవ గూగుల్ డేటా సెంటర్ ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పడటం గర్వకారణం అని పలువురు టిడిపి నాయకులు పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్‌ను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకువచ్చినందుకు కతజ్ఞతలు తెలుపుతూ గురువారం నియోజక వర్గ టిడిపి కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం ఎంతో గర్వకారణమని, దీని ద్వారా రాష్ట్ర భవిష్యత్తు మరింత వెలుగులు నిండుతుందన్నారు. దీని ద్వారా రాష్ట్రంలో సుమారు రెండు లక్షల ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. టౌన్ పార్టీ అధ్యక్షుడు లోగిశెట్టి స్వామి, సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, మున్సిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్,పార్టీ పట్టణ కమిటీ నాయకులు ఇలియాస్ పాషా పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యర్థాలను తొలగించాలి : కమిషనర్

ప్రజాశక్తి - గుడివాడ : ప్రజలు అందరూ కొత్తగా వేసిన అమత్ టాప్స్ వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ పేర్కొన్నారు. గుడివాడ పురపాలక సంఘంలో గురువారం మున్సిపల్ కమిషనర్ ఎస్ మనోహర్ ఫీల్డ్ విజిట్ లో భాగంగా 6వ వార్డును విజిట్ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్టిఆర్ కాలనీ స్కూల్ బ్యాక్ సైడ్ రోడ్డు, 6వ వార్డులో ఉన్న పాత వాటర్ పైప్లైన్‌ను తీసివేయాలన్నారు. శ్మశానం నుండి వచ్చే వ్యర్థాలను బయట వేయకుండా ఉండేటట్లు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రామాలయం



వీధిలో డీసిల్టేషన్ చేసిన డ్రైనేజ్ పోగులను, వార్డులోని సి అండ్ డి వేస్ట్ ను క్లియర్ చేయాలని తెలిపారు. అనంతరం వార్డులోని వాటర్ ప్లాంటును తనిఖీలు నిర్వహించారు.


సర్పంచ్ కృష్ణకుమారిని సత్కరిస్తున్న దృశ్యం

స్వచ్ఛ చల్లపల్లి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-చల్లపల్లి : సమాజంలో ప్రతి ఒక్కరూ ఆనందం, ఆరోగ్యంగా ఉండాలంటే పరిశుభ్రత అత్యుత్తమ మార్గం అని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. చల్లపల్లి పంచాయతీకి రాష్ట్రస్థాయిలో స్వచ్ఛ ఆంధ్ర అవార్డు వచ్చిన సందర్భంగా పంచాయతీ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పేర్ని వెంకట మాధవేంద్రవేంద్రరావులను గురువారం పంచాయతీ కార్యాలయంలో మర్యాదపూర్వ కలిసి అభినందించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ దేశంలో స్వచ్ఛతకు బ్రాండ్‌గా చల్లపల్లి పంచాయితీ పేరు పొందిందన్నారు. పంచాయితీకి అభివద్ధి, గుర్తింపు సాధించేలా సర్పంచ్ కష్ణకుమారి, ఈవో మాధవేం ద్రరావు చేస్తున్న కృషి పనితీరు ప్రశంసనీయమని సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేతలు చింతల శ్రీనివాసరావు,వీఆర్వో అమలేశ్వరరావు, వెంకటస్వామి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేకాట క్లబ్‌ల ఏర్పాటును విరమించుకోవాలి : వైసిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలో నకిలీ మద్యం విక్రయాలు, అక్రమ సీసాల సరఫరా వంటివి తారాస్థాయికి చేరాయని, ఇప్పుడు అవనిగడ్డలో పేకాట క్లబ్బుల ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇవి ప్రజల ప్రాణాలతో ఆటలాడే అతిపెద్ద నేరమని వైసిపి నియోజకవర్గ యువ నేత బడే గౌతం విమర్శించారు. ఇందుకు స్థానిక ప్రజాప్రతినిధి నిర్లక్ష్యం కారణమన్నారు. నియోజకవర్గంలో పరిస్థితి మరింత దారుణంగా మారిపోయిందని, ప్రజలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం అవుతున్నారని ప్రజల మద్యం వ్యసనానికి, జూదానికి బానిసలు అవుతుంటే స్థానిక ఎంఎల్ఎ ఈ అక్రమ వ్యవస్థలను కాపాడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారన్నారు. ఇప్పుడు అవనిగడ్డలో పేకాట క్లబ్బులు ఏర్పాటుకు ప్రయత్నాలు కూడా జరుగుతుండడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం రేపుతోందని, ఈ నియోజకవర్గం సంస్కృతిని, సంప్రదాయాన్ని, నీతిని భవిష్యత్తును నాశనం చేసే ఈ విధమైన చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గౌతం తెలిపారు

ముగిసిన పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి-ఉయ్యూరు : చిన్నారుల్లో ఉబకాయాన్ని నిర్మూలించేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ బేబీ సరోజిని సూచించారు. ఎనిమిదవ రాష్ట్రీయ పోషణ్ మాస ఉత్సవాల ముగింపు కార్యక్రమం మండలంలోని చినఓగిరాల అంగన్వాడి కేంద్రంలో గురువారం ఘనంగా ముగిసాయి. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు చేతివేళ్ల ద్వారా శుభ్రత విధానాన్ని అవగాహన కల్పించారు. సందర్భంగా సూపర్వైజర్ బేబీ సరోజినీ మాట్లాడారు. ప్రతి ఒక్కరు భుజించే ఆహారంలో అనేక పోషకాలు , విటమిన్లు తప్పక ఉండాలన్నారు. ఉబకాయ నివారణకు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు వ్యాయామం క్రమం తప్పకుండా చేయించాలని ఆహార నియంత్రణ పాటించేలా తల్లులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం లత, అంగన్వాడి కార్యకర్తలు ప్రతిభ, శాంత కుమారి, నాగలక్ష్మి,ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

అలాగే మండలంలోని ముదునూరు అంగన్వాడి కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక వెల్నెస్ సెంటర్ సిహెచ్ఓ ప్రత్యూష పాల్గొని మాట్లాడారు. మహిళా సంరక్షణ కార్యదర్శి నాగలక్ష్మి, సూపర్వైజర్ బేబీ సరోజిని, అంగన్వాడి కార్యకర్తలు సిహెచ్ విజయలక్ష్మి, ఝాన్సీ రాణి, చుక్కమ్మ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : గన్నవరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గత నెల 17 నుండి ఈ నెల 16 వరకు 8వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని సూపర్వైజర్ పద్మాదేవి అన్నారు. ఉంగుటూరు మండలంలోని తేలప్రోలు అంగన్వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మాదేవి మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రత ప్రతి ఒక్కరికి అవసరమని, పోషక విలువలతో కూడిన ఆహారం అనగా ఆకుకూరలు పీసుపదార్థం ఉండేలా ఆహారాన్ని తీసుకోవాలని, చిరుదాన్యాల తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ లు, బాలింతలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **ప్రజాశక్తి గుడ్లవల్లేరు** : మండలంలోని అంగలూరు అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గురువారం పోషకాహారంపై అవగాహనా సదస్సును చేపట్టారు. గర్భిణులు, బాలింతలు, తల్లులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నసీరున్నీసా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గర్భవతులు, బాలింతలు, పిల్లల తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్త ఉషారాణి, హెల్పర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : కంకిపాడు ఐసిడిఎస్ పరిధిలోని పెనమలూరు మండలం యనమలకుదురు గ్రామంలో పోషకాహార మాసోత్సవాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు శ్రీమంతం నిర్వహించారు. గర్భిణీలు,ు బాలింతలకు తీసుకోవాల్సిన జాగ్రలు, రక్తహీనత వలన వచ్చే సమస్యల గురించి, పౌష్టిక ఆహార ప్రాముఖ్యత గురించి కంకిపాడు ప్రాజెక్టు కమిటీ సిడిపిఓ కే బేబీ సుకన్య వివరించారు. సూపర్వైజర్ ఎల్ సులోచన రాణి, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉయ్యూరులో...


ఉంగుటూరులో..


కంకిపాడులో...


అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్

'నమస్తే స్కీం'పై అవగాహన

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : ప్రజలు వినియోగించి అనంతరం పారవేసే చెత్త, వస్తువులను ఏరుకుని జీవనోపాధి పొందే వాళ్లను ప్రభుత్వం గుర్తించి వారికి అండగా ఉంటుందని మచిలీపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ చోడే వీర వెంకట సత్య బాపిరాజు పేర్కొన్నారు. గురువారం మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలో అసిస్టెంట్ కమిషనర్ ఎం గోపాల్ రావు ఆధ్వర్యంలో సుమారుగా 100 మంది వేస్ట్ పిక్కర్స్ ను (జీవన ఆధారం కోసం రోడ్లపై, చెత్తకుప్పలో, డంపింగ్ యార్డ్ లో ప్లాస్టిక్, ఇనుప వస్తువులు, గాజు సీసాలు మొదలగునవి ఏరుకునే వారిని) నమస్తే స్కీం కింద ప్రొఫైలింగ్ క్యాంపెయిన్ ఏర్పాటు చేసి, వారికి అవగాహన కల్పించారు. దళిత బహుజన రిసోర్స్ సంస్థ ఆధ్వర్యంలో రమేష్ చెత్త ఏరుకునే వాళ్ళ వివరాలను నమోదు చేసి వారందరికీ ఇండియా పోస్ట్ బ్యాంక్ ఖాతాలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ , మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి.బాబా ప్రసాద్,క్లస్టర్ ఇన్చార్జి పల్లపాటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

జాతీయ రెజ్లింగ్‌కు సిద్ధార్థ విద్యార్థుల ఎంపిక




ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ గ్రాప్లింగ్ రెజ్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హిందూపూర్‌లో జరిగిన 5వ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో విజయవాడ పి.బి. సిద్ధార్థ కళాశాల విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. జాతీయస్థాయి రెజ్లింగ్ పోటీలకు ఆరుగురు సిద్ధార్థ విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ఆచార్య రాజేష్ సి. జంపాల, క్రీడా విభాగాధిపతి డాక్టర్ టి.వి. బాలకష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బి.చైతన్య నాగవర్ధన్ రాజు 54 కిలోల జూనియర్స్ విభాగం నాగి స్టయిల్ అంశంలో స్వర్ణపతకం, 83 కిలోల నాగి జూనియర్ విభాగంలో వై.టాగూర్ సన్నీ గోల్డ్ మెడల్, 65 కిలోల నాగి స్టయిల్ జూనియర్ విభాగంలో ఎం రాణి, సీనియర్స్ నాగి స్టయిల్ అంశంలో 66 కిలోల విభాగంలో ఎస్.కె. జహీరుద్దీన్ స్వర్ణ పతకం, 49 కిలోల సీనియర్ విభాగం జి.ఐ.ఈవెంట్ లో వి.దేవిశ్రీ స్వర్ణపతకం, 77 కిలోల సీనియర్స్ విభాగంలో ఎన్.పవన్ కుమార్ వెండిపతకం సాధించడం పట్ల సిద్ధార్థ అకాడమీ పాలకవర్గం కూడా అభినందనలు తెలిపింది.

పొగాకు నుండి యువతను రక్షించాలి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : పొగాకు నుంచి యువతకు రక్షణ కల్పించాలని ప్రముఖ పల్మనరీ మెడిసిన్ వైద్యులు డాక్టర్ పవన్ గుప్తా అన్నారు. నగరంలోని ఓ హెూటల్‌లో పొగాకు నియంత్రణపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఫ్రేమ్‌వర్క్ కన్వెన్షన్ ఆన్ టొబాకో కంట్రోల్ సీవోపీ ముందస్తుగా స్మోక్‌ఫ్రీ ఇండియా నాలుగు అంశాల చర్యకు పిలుపునిచ్చిందన్నారు. నిత్యం 5,500 కన్నా ఎక్కువ మంది భారతీయ పిల్లలు పొగాకును కొత్తగా వినియోగిస్తున్నారని తెలిపారు. పొగాకు నియంత్రణ, యువత కేంద్రీకృత విరమణ, ప్రత్యామ్నాయాల సమతుల్య నియంత్రణ, ప్రయోజనాల సంఘర్షణలను అంతం చేయడం గురించి స్మోక్‌ఫ్రీ ఇండియా డిమాండ్ చేస్తోందని తెలిపారు.

కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కార్మికుల ఆరోగ్య భద్రత,సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, వారికి నిరంతరం అండగా ఉంటామని సాయి శానిటేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు పంచానంద్ అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సాయి శానిటేషన్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్‌లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులు, పేదలు సుమారు 250 మందికిపైగా నూతనంగా వస్త్రాలను సంస్థ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దీపావళి సందర్భంగా ప్రతికుటుంబంలో కాంతులు విరజిల్లాలని అకాంక్షించారు. అధ్యక్షులు పంచానంద్ మాట్లాడుతూ విజయవాడలో పని చేస్తున్న వారికే కాకుండా నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం, హైదరాబాదు తదిత ప్రాంతాల్లో పని చేస్తున్న తమ సంస్థ ఉద్యోగులకు నూతన దుస్తులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మున్నిదేవి, కమీటీ సభ్యులు రేఖ దేవి,నిర్వహకులు టి.వెంకటశ్రీను, పాల్గొన్నారు



మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీల్లో, నగర పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని స్థానిక సిపిఐ, ఏఐటియుసి నాయకులు విమర్శించారు. గురువారం మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో నవంబర్ 3వ తేదీ నుండి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. సమ్మె నోటీసును గురువారం మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి అంబోజీ శివాజీ, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పోతుపాక వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా నైపుణ్యాలు

• కలెక్టర్ జి.లక్ష్మీశ



ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : ప్రస్తుతం జాబ్ మార్కెట్‌కు అనుగుణంగా యువత నైపుణ్యాలు సముపార్జించాలని.. అప్పుడే కెరీర్ పరంగా ప్రపంచ వ్యాప్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. గురువారం జిల్లా నైపుణ్యాభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ (ఏపీ ఎస్ఎస్‌డీసీ) ద్వారా అందిస్తున్న సేవలకు సంబంధించిన వివరాలను, సంస్థ కార్యకలాపాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏపీ ఎస్ఎస్‌డీసీ ద్వారా ఎప్పటికప్పుడు నైపుణ్యాభివద్ధి శిక్షణ కార్యక్రమాలతో పాటు జాబ్ మేళాలను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా రష్యా, జర్మన్, ఖతార్ తదితర దేశాల్లో కూడా వివిధ ఉద్యోగావకాశాలు పొందేందుకు ఆయా భాషల్లో శిక్షణతో పాటు ఉద్యోగాలు పొందేందుకు చేయూతనందిస్తోందన్నారు. ఇలాంటి అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వెంట సీపాన శ్రీనివాసరావు, డిఆర్‌డిఎ పిడి ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

జోగి రమేష్ పోలీసులకు లొంగిపోవాలి

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాష్ట్రంలో కల్తీ మద్యం కేసు చర్చనీయాంశంగా మారిందని మాజీ ఎంఎల్‌సి బుద్ధ వెంకన్న పేర్కొన్నారు. గురువారం వన్‌టౌన్‌లోని తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కల్తీ మద్యం దందా వ్యవహారంలో వైసిపి నేత జోగి రమేష్ సాక్షాధారాలతో సహా అడ్డంగా దొరికాడన్నారు. కల్తీ మద్యం కేసులో జోగి రమేష్ పాత్ర నిర్ధారణ అయ్యిందని, ఈ కేసులో కీలక సూత్రధారి జగన్మోహన్ రెడ్డిని కూడా సిట్ బృందం విచారణ చేయాలని డిమాండ్ చేశారు. సిట్ విచారణ పూర్తయ్యక వాస్తవాలన్నీ బయటకు వస్తాయని తెలిపారు. జోగి రమేష్ పోలీసులు ఎదుట లొంగిపోయి విచారణకు సహకరించాలని హితవు పలికారు.

సైకాలజిస్టుల కమిటీ ఏర్పాటు



ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ గర్రె శంకరరావు, సైకాలజిస్టు డాక్టర్ టి.ఎస్.రావు గురువారం జిల్లా కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయిలో ఎక్స్‌పర్ట్ సైకాలజిస్టుల కమిటీ ఏర్పాటు చేయాలనే ముఖ్యమైన ప్రతిపాదనపై చర్చ జరిగింది. ఈ కమిటీ ద్వారా అర్హత కలిగిన సైకాలజిస్టులు స్వచ్ఛందంగా తమ వృత్తి నైపుణ్యాలను వినియోగించి మానసిక ఆరోగ్య అవగాహనను పెంపొందించడం , సమాజంలో ప్రధానమైన మానసిక-సామాజిక సమస్యలను పరిష్కరించడానికి సేవలందించనున్నారు. స్వచ్ఛందంగా సేవలందించాలనుకునే సైకాలజిస్టులు తమ పేరు, సంప్రదింపు వివరాలును డాక్టర్ గర్రె శంకరరావుకు తెలియచేయాలని అన్నారు. ఈ కార్యక్రమం జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వంలో మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సంక్షేమం, యువత మార్గదర్శక కార్యక్రమాలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఉంది.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



విజయవాడ: కార్మిక వర్గం అనేక త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను కట్టు బానిసలుగా చేస్తుందని సిఐటియు ఆటోనగర్ నాయకులు యన్.నాగేశ్వరరావు తెలిపారు. విజయవాడ తూర్పు నగర, సిటీ ఇండస్ట్రియల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు 16వ మహాసభ పోస్టర్‌ను ఆయన గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. సిఐటియు తూర్పు నగర 16వ మహాసభ రాణిగారితోట, కళ్యాణ మండపంలో జరుగుతుందని తెలిపారు. ఈ మహాసభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ ఆందోళన, పోరాటాలకు పిలుపునిచ్చే విధంగా ఈ మహాసభ జరుగుతుందన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తోందని తెఇపారు. దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ముక్కలు చేసి అమ్మాలని విశ్వ ప్రయత్నాలు చేస్తుందని, విద్యుత్ రంగాన్ని ప్రైవేటు చేతుల్లో పెట్టేందుకు పావులు కదుపుతోందని తెలిపారు. ప్రత్యేక హెూదా ఇవ్వకపోయినా, విభజన హామీలను అమలు చేయకపోయినా రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. ఆసియాలోనే అతి పెద్దదిగా ఉన్న ఆటోనగర్ను ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. వీటిపై సిఐటియు పోరాటం సాగిస్తుందని పోరాటం సాగిస్తుందని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో ఆటోనగర్ సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్, దుర్గారావు, ఆటోనగర్ కార్మికులు రమేష్, వీరయ్య, బాజీ, శ్రీరాములు, రవి, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు వజ్రాభరణాలు సమర్పించిన కీర్తి లాల్



ప్రజాశక్తి విజయవాడ సిటీ : విజయవాడక కీర్తి లాల్ జువెలరీస్ షోరూమ్ కీర్తి లాల్ కాళిదాస్ దంపతులు, డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ దుర్గమ్మను దర్శించుకుని వజ్రభరణాలను కానుకులు గా సమర్పించారు. గురువారం రాత్రి ఇంద్రకీలాద్రి కి విచ్చేసిన కీర్తి లాల్ షోరూమ్ అధినేత కీర్తి లాల్ కాళిదాస్ శ్రీ కనకదుర్గ అమ్మవారికి 531 గ్రాముల బరువు గల బంగారంతో తయారు చేసిన విశేష వజ్రాభరణాలను దుర్గగుడి ఈవో సీనా నాయక్ కు అందజేశారు. దుర్గమ్మకు సూర్యుడు, చంద్రుని ఆకారంలో తయారుచేసిన ముక్కు పుడకలు, బులాకీ,బొట్టు, సూత్రాలు, గొలుసు వంటి ఆభరణాలను బంగారంతో చేయించి, వజ్రాలు పొదిగి కానుకులు కానుకులుగా సమర్పించారు.దాతల నుండి ఆభరణాలును ఆలయ చైర్మన్ బొర్రా రాధాకష్ణ,ఈవో శీనానాయక్ స్వీకరించారు. అనంతరం దాతతో పాటు కుటుంబ సభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా దాతలను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించి, చిత్రపటం, తీర్థప్రసాదాలను బహూకరించారు. కార్యక్రమంలో తమిళనాడు గవర్నర్ సతీమణి లక్ష్మి రవి, పార్లమెంట్ మాజీ సభ్యులు గోకరాజు గంగరాజు, కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



'డీకన్ స్ట్రక్ట్'కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : హైలీ ఎఫెక్టివ్, యెట్ జెంటిల్' ఫిలాసఫీగా ప్రముఖ చర్మ సంరక్షణా సంస్థ డీకన్‌స్ట్రక్ట్ స్కిన్‌కేర్ అధికారికంగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టైటిల్‌ను బద్దలు కొట్టింది. ఈ మేరకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ సీనియర్ అడ్జుడికేటర్ స్వాప్నిల్ దంగారికర్ చేతుల మీదుగా డీకన్‌స్ట్రక్ట్ స్కిన్‌కేర్ వ్యవస్థాపకురాలు మాలిని అడపురెడ్డి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా మాలిని మాట్లాడుతూ 24 గంటల డెర్మథాన్ ద్వారా 'ది లాంగెస్ట్ స్కిన్‌కేర్ లైవ్‌స్ట్రీమ్' కోసం కొత్త టైటిల్‌ను సెట్ చేసిందని చెప్పారు. "గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ టీఎం టైటిల్ కారణంగానే కాకుండా, దేశవ్యాప్తంగా తాము చూసిన అపూర్వమైన భాగస్వామ్యం కారణంగా డెర్మథాన్ ఒక అద్భుతమైన విజయంగా భావించవచ్చు అన్నారు. డెర్మటాలజిస్ట్ లు కష్టమైన స్కిన్ కేర్ ను ప్రతీ ఒక్కరికీ అర్థమయ్యేలా, ఆచరణీయంగా మార్చడంలో కీలక పాత్ర పోషించారని, ఈ నిపుణులు తమకున్న పరిజ్ఞానంతో రోజువారీ సమస్యలు, వారికున్న సందేహాలను నివత్తి చేశారన్నారు.

ఘాట్లు పరిశుభ్రంగా ఉంచండి

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : ఘాట్లను పరిశుభ్రంగా ఉంచాలని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం కృష్ణవేణి ఘాట్, భవానీ ఘాట్, పున్నమి ఘాట్, కామకోటి నగర్, తుళ్లూరు వారి వీధి, మాధవ శర్మ వీధి, క్వారీ రోడ్, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్, సితారా సెంటర్ తదితర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఘాట్లపైన పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, రానున్న భవాని దీక్ష విరమణ కోసం వచ్చే భక్తులకు, ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు కన్వేయర్ బెల్ట్‌ను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, అవసరమైన చోట మరొక కన్వీర్ బెల్ట్‌ను ఏర్పాటు చేసేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పునమిఘాట్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక మరుగుదొడ్లను పరిశీలించారు. ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్‌లో జరుగుతున్న డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించి అక్కడున్న నిర్మాణ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. తదుపరి వన్ టౌన్ గాంధీజీ మహిళా కళాశాల వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలించారు. ఈ పర్యటనలో డిప్యూటీ సిటీ ప్లానర్ సుభాష్ చంద్రబోస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. శ్రీనివాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.